మంద కృష్ణ పద్మశ్రీ అందుకోవడం హర్షనీయం

హనుమకొండ, మే 28 : మంద కృష్ణ మాదిగ పద్మశ్రీ అందుకోవడంపై బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. మూడు దశాబ్దాలుగా ఎంచుకున్న లక్ష్యం కోసం మడమ తిప్పకుండా పోరాడుతున్న ఉద్యమానికి దక్కిన గౌరవం ఇది అన్నారు. ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా మొక్కవోని దీక్షతో కొట్లాడుతూ, తన పోరాట పటిమతో ఎన్నో ప్రజా ఉద్యమాలకు మార్గదర్శిగా నిలిచిన ప్రజా ఉద్యమకారుడు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ ప్రజా వ్యవహారాల విభాగంలో బుధవారం పద్మశ్రీ అవార్డు స్వీకరించిన వేళ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

మల్లికాంబలో ఉచిత వైద్య శిబిరం

హనుమకొండ, మే 28 : బాలసముద్రంలోని మల్లికాంబ మనో వికాస కేంద్రంలో బుధవారం మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కేంద్రంలోని మానసిక దివ్యాంగులైన చిన్నారులు, సిబ్బందికి న్యూరాలజీ, బీపీ, షుగర్, పల్స్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేయూ పాలక మండలి సభ్యురాలు, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ అనితారెడ్డి మాట్లాడుతూ.. మెడికవర్ హాస్పిటల్ వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా మల్లికాంబలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారన్నారు. కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ డాక్టర్లు ప్రియాంక, జనతారెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, కేంద్రం నిర్వాహకులు బండ రామలీల, కోడం కల్యాణ్ పాల్గొన్నారు.

'ఉపాధి' పని ప్రదేశాల్లో ఉపాధ్యాయుల 'బడిబాట'

ఉపాధి పని ప్రదేశంలో బడిబాట నిర్వహిస్తున్న వెంకటాపూర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

హనుమకొండ చౌరస్తా, మే 28 : జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదు పెంచడమే ప్రధాన లక్ష్యంగా ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. ఇంటి వద్ద తల్లిదండ్రులు లేకపోతే వారు పనిచేసే వ్యవసాయ క్షేత్రాలు, ఉపాధి హామీ పథకం పని ప్రదేశాలకు వెళ్లి అక్కడే సమావేశం నిర్వహిస్తున్నారు. బ్యానర్లు, కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, ప్లకార్డ్స్ పట్టుకొని ప్రభుత్వ బడి విశిష్టతలను తెలియజేస్తున్నారు. నెల 9న తల్లిదండ్రులతో, 16న స్వయం సహాయక బృందాలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులతో, 26న అంగన్‌వాడీ టీచర్లు, తల్లుల కమిటీ సభ్యులతో, 30న స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులతో సమావేశం నిర్వహించనున్నారు.

పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి : డీఈవో వాసంతి

తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి. ఉపాధ్యాయులు వ్యవసాయక్షేత్రాలు, జాతీయ ఉపాధి హామీ పథకం పనిప్రదేశాల్లో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి. బుధవారం వరకు ఒకటో తరగతి 728, ఆరో తరగతిలో 893, 8వ తరగతిలో 287 మంది విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలని గుర్తించాం.

జిల్లా సగటు వర్షపాతం 29.2మిల్లీమీటర్లు

హనుమకొండ, మే 28 : జిల్లాలో బుధవారం ఉదయం 8గంటల వరకు 29.2 మిల్లీమీటర్ల సరాసరి వర్షపాతం నమోదైంది. అత్యధికంగా హనుమకొండ మండలంలో47.9మిల్లీమీటర్లు నమోదుకాగా, అత్యల్పంగా నడికూడ మండలంలో 3.9 మిల్లీమీటర్లు నమోదైంది. అలాగే జిల్లాలోనీ భీమదేవరపల్లి మండలంలో 44.0మిల్లీమీటర్లు, వేలేరులో 42.0మిల్లీమీటర్లు, ఎల్కతుర్తిలో 40.9మిల్లీమీటర్లు, కమలాపూర్‌లో 11.2మిల్లీమీటర్లు, హసన్‌పర్తిలో 22.7మిల్లీమీటర్లు, ధర్మసాగర్‌లో 36.2 మిల్లీమీటర్లు, ఐనవోలులో 25.7మిల్లీమీటర్లు, పరకాలలో 6.3మిల్లీమీటర్లు, దామెరలో 18.7మిల్లీమీటర్లు, ఆత్మకూరులో 330.9మిల్లీమీటర్లు, శాయంపేటలో 31.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

'పరిశోధన అంశాలకు మాత్రమే పరిమితం కావొద్దు'

హనుమకొండ చౌరస్తా, మే 28 : పరిశోధనా అంశాలకు మాత్రమే పరిమితం కావొద్దని గణితశాస్త్ర విభాగం ప్రొఫెసర్ మల్లారెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ గణిత శాస్త్ర విభాగం సెమినార్ హాల్‌లో పీహెచ్‌డీ ప్రవేశాలు పొందిన పరిశోధకులకు నిర్వహిస్తున్న రీసెర్చ్ మెథడాలజీపై విస్తృత ఉపన్యాసం చేశారు. పరిశోధకులు సామజిక, ఆర్థిక, భావోద్వేగ, ఫిజికల్, సైకలాజికల్ అంశాలనూ దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ప్రజా సంబంధాల అధికారి వల్లాల పృథ్వీరాజ్, గణితశాస్త్ర విభాగాధిపతి భారవిశర్మ పాల్గొన్నారు.

విపత్తుల సమయంలో వెంటనే స్పందించాలి

పరకాల, మే 28 : విపత్తులు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో వలంటీర్లు వెంటనే స్పందిస్తే నష్ట తీవ్రతను తగ్గించొచ్చని ఆర్డీవో నారాయణ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో రాష్ట్ర విపత్తుల సంస్థ ఆధ్వర్యంలో వలంటీర్లకు శిక్షణ ప్రారంభించారు. అత్యవసర సమయంలో వెంటనే స్పందిస్తే ప్రమాద తీవ్రత, ప్రాణనష్టం తగ్గించొచ్చన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, మెడికల్ ఆఫీసర్ దివ్య, సేఫ్టీ ఫైర్ ఆఫీసర్ భద్రయ్య, మెప్మా ఏడీఎంసీ సతీశ్ పాల్గొన్నారు.

వలంటీర్లు బాధ్యతతో సేవలు అందించాలి

కలెక్టర్ ప్రావీణ్య

మడికొండ, మే 28 : ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఆపదమిత్ర వలంటీర్లు బాధ్యతతో సేవలు అందించాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. మడికొండలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో జిల్లా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఆపదమిత్ర వలంటీర్ల శిక్షణ కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. విపత్తులు, ఆపద సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా కాపాడేలా ఆపదమిత్ర వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. వైద్య, ఆరోగ్య, మత్స్య, అగ్నిమాపక శాఖలను భాగస్వామ్యం చేస్తూ ఆ శాఖల అధికారులు సీపీఆర్ చేయడం, అగ్ని ప్రమాదాల నుంచి కాపాడటం, వరదలు సంభవించినప్పుడు ఎలా రెస్క్యూ చేస్తారనే వివరాలను తెలిపారు. కార్యక్రమంలో నేహ్రూ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ అన్వేశ్, మెప్మా కో ఆర్డినేటర్ రజితారాణి, జయశ్రీ పాల్గొన్నారు.

మడికొండ : జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన..

హనుమకొండ : హనుమకొండలో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు కలెక్టర్ అధికారులతో కలిసి పబ్లిక్ గార్డెన్ సమీపంలోని పాత ఆర్ అండ్ బీ క్వార్టర్స్ భవన సముదాయం ఆవరణలో ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. స్థల విస్తీర్ణం, భవన వివరాలను ఆర్‌అండ్‌బీ ఈఈ సురేశ్‌బాబును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అలాగే స్థలానికి సంబంధించిన మ్యాపును పరిశీలించారు. కలెక్టర్‌తో పాటు విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్‌రావు, డీఈ సాంబరెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ రంజిత్ పాల్గొన్నారు.

వీసీలో పాల్గొన్న కలెక్టర్..

రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా లాభసాటి వ్యాపార యూనిట్లు ఏర్పాటు చేసి పక్కాగా గ్రౌండింగ్ జరిగేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాజీవ్ యువ వికాసం అమలుపై డిప్యూటీ సీఎం మంత్రి పొన్న ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ కృష్ణారావుతో కలిసి సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ ప్రావీణ్య, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్లు వైవీ గణేశ్, మేన శ్రీను, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు పాల్గొన్నారు.

మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు..

జిల్లాలో మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1,57,200 టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 1,14,128.960 టన్నులు కొనుగోలు చేసి ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు పంపిస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం ఈ తేదీ నాటికి 75,960 టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ఈ సారి 38,168.960 మెట్రిక్ టన్నుల ధాన్యం అధికంగా కొనుగోలు చేశామన్నారు. 24,899 మంది రైతుల నుంచి రూ. 253.18కోట్ల విలువైన 1,09,209.600 టన్నులు కొనుగోలు చేసి ఆన్‌లైన్ ఎంట్రీ చేశామని తెలిపారు. ఇప్పటి వరకు 23,937 రైతుల బ్యాంకు అకౌంట్లలో రూ. 244.49 కోట్లు జమ చేశామన్నారు. ఇప్పటివరకు 32.50 లక్షల గోనె సంచులు సరఫరా చేశామని తెలిపారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

ధర్మసాగర్, మే 28 : ధర్మసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం డీఎంహెచ్‌వో అప్పయ్య తనిఖీ చేశారు. అనంతరం ధర్మసాగర్ సబ్‌సెంటర్-1లో రిజిస్టర్లు పరిశీలించారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో మాట్లాడారు. ప్రభుత్వాస్పత్రుల్లో డెలివరీలు పెంచాలని సూచించారు. ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో మరింతగా నమ్మకం కలిగేలా పని చేయాలని తెలిపారు. మండలంలో 104 వాహనం సేవలను ఉపయోగించుకునేలా చూడాలన్నారు. క్రమం తప్పకుండా టీబీ రోగులకు ఇంటి వద్దకు వెళ్లి మందులు ఇవ్వాలన్నారు. వర్షకాలం సమీపిస్తున్న తరుణంలో సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని చెప్పారు. క్యాన్సర్ రోగుల దగ్గరకి వెళ్లి రెగ్యులర్‌గా మందులు ఇవ్వాలని చెప్పారు. వైద్యులు అరుణ, నెహ్రూచంద్ నాయక్, మహేందర్, అలేఖ్య, శృతి, భారతి, రుచిత, కవిత, శ్వేత, సూపర్‌వైజర్ ప్రసన్నకుమారి, రామ్మోహన్ ఉన్నారు.

అడ్వకేట్ కాలనీ స్థలం కబ్జాకు తెగపడ్డ కేటుగాళ్లు

న్యాయవాదుల స్థలాలకే రక్షణ లేని దుస్థితి

వరంగల్ లీగల్, మే 28 : ప్రజలు తమ స్థలాలు భూములు కబ్జాకు గురైతే న్యాయవాదులను ఆశ్రయించి న్యాయస్థానాల్లో కేసులు వేయడం తమ ఆస్తిపాస్తులు రక్షించుకోవడం సాధారణం. కానీ న్యాయవాదుల స్థలాలలనే కొందరు కబ్జా చేశారు. 2009లో 210 మంది న్యాయవాదులు సొసైటీగా ఏర్పడి కడిపికొండలోని రైతుల నుంచి 20 ఎకరాలు కొనుగోలు చేశారు. ఆ స్థలాన్ని ప్లాట్లుగా విభజించి న్యాయవాదులకు కేటాయించారు. 15 సంవత్సరాలుగా ఏ అవరోధాలు లేకుండా ఉన్న ఈ ప్రాంతంలో కొందరు కబ్జాదారులు పార్కు స్థలాన్ని ఆక్రమించడానికి ప్రయత్నించడం కలకలానికి దారితీసింది. విషయం తెలిసిన న్యాయవాదులు బుధవారం కడిపికొండ శివారులోని సొసైటీ స్థలంలో పెద్ద ఎత్తున సమావేశమై పార్కు స్థలాన్ని చదును చేయించారు. ఈ స్థలం తమదేనని, పార్కుపై ఎవరి కన్ను పడ్డా ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. న్యాయవాదులమైన తమ భూములకే రక్షణ లేకుంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటి అని సొసైటీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నీల శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో సంబంధిత పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. న్యాయవాదులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, గవర్నమెంట్ లీడర్లు, న్యాయమూర్తులుగా నిధులు నిర్వర్తిస్తున్న ఈ సొసైటీ సభ్యుల స్థలాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులపై ఉందని వారు పేర్కొన్నారు.

చౌరస్తా రోడ్డును వెడల్పు చేస్తాం

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

నయీంనగర్, మే 28 : ప్రజల సౌకర్యార్థం హనుమకొండ చౌరస్తా రోడ్డును వెడల్పు చేస్తామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం కోసం ప్రభుత్వం జీవో జారీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఈవీ శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, వెంకటేశ్వర్లు, సరళ, రామకృష్ణ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన క్రైం ఏసీపీ సదయ్య

సుబేదారి, మే 28 : వరంగల్ పోలీసు కమిషనరేట్ క్రైం విభాగం ఏసీపీగా సదయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సదయ్య ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎస్సైగా, ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 17మందికి జరిమానా..

హనుమకొండ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 17మందికి రూ.16,900 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

మైసయ్యకు సన్మానం

మైసయ్యను సన్మానిస్తున్న డీఈవో వాసంతి

నయీంనగర్, మే 28 : ఇటీవల పాఠశాల విద్యాశాఖ ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యాయామ విద్య ఉపాధ్యాయులు సుమారు 120మంది శిక్షణలో పాల్గొనగా ఇందులో పరికరాల మైసయ్య అత్యుత్తమ ప్రతిభ చూపి మొదటిస్థానంలో నిలిచాడు. హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్‌లోని మాంటిస్సోరి పాఠశాలలో డీఈవో వాసంతి ఆయనను సన్మానించారు.

మాజీ కౌన్సిలర్‌పై దాడి

హసన్‌పర్తి (పరకాల), మే 28 : వ్యక్తిగత కక్షలతో వ్యక్తిపై దాడి చేసిన ఘటన హసన్‌పర్తి మండలంలోని సిద్ధాపూర్ గ్రామ శివారులో బుధవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల పరకారం.. పరకాల మున్సిపాలిటీకి చెందిన మాజీ కౌన్సిలర్ అల్లె దశరథంపై కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో దాడి చేశారు. కాగా, గాయపడిన దశరథంను వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. వ్యక్తిగత కక్షలతోనే దశరథంపై దాడి జరిగి ఉండొచ్చని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై పోలీసుల వివరణ కోరగా పూర్తి వివరాలు వెల్లడించ లేదు.

పిల్లలకు వ్యాధులు రాకుండా చూడాలి

దామెర, మే 28 : మండల కేంద్రంలోని పీహెచ్‌సీని జిల్లా మెటర్నిటీ, చైల్డ్ హెల్త్ ప్రొగ్రాం ఆఫీసర్ డాక్టర్ మంజుల బుధవారం సందర్శించారు. బాలింతలు, చిన్నపిల్లల ఆరోగ్యంతో పాటు జ్వరాల తీవ్రతను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బాలింతల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ ఉండాలని, చిన్నపిల్లలకు సకాలంలో టీకాలు వేయించేలా ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మహేంద్రన్, సూపర్‌వైజర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

కుప్పకూలిన పాఠశాల ప్రహరీ

తక్కళ్లపహాడ్‌లో కూలిన పాఠశాల ప్రహరీ

దామెర, మే 28 : మండలంలోని తక్కళ్లపహాడ్ ప్రభుత్వ పాఠశాల ప్రహరీ కుప్పకూలింది. మన ఊరు-మనబడి కింద ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా, సంవత్సరంన్నర క్రితం సదరు గుత్తేదారు గోడ నిర్మించాడు. నిర్మాణంలో నాణ్యతను పాటించకపోవడం, గోడకు ఇరువైపులా మట్టిని పోయకపోవడం వల్ల మంగళవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి సుమారు 50ఫీట్ల మేర గోడ కుప్పకూలిందని స్థానికులు తెలిపారు. మిగతా గోడ కూడా కొంతమేరకు ఒక వైపుకు ఒరిగిపోయిందన్నారు.

కాజీపేటలో రైల్వే ఏడీఆర్ఎం తనిఖీలు

కాజీపేట, మే 28 : కాజీపేట రైల్వే స్టేషన్ పరిధిలోని పలు చోట్ల సికింద్రాబాద్ రైల్వే డివిజన్ ఏడీఆర్ఎం గోపాల్ బుధవారం తనిఖీలు నిర్వహించారు. సికింద్రాబాద్ నుంచి ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రధాన కార్యాలయానికి చెందిన సెంట్రల్ డీఈఎన్ ప్రంజ్వల్ కేసవాణితో కలిసి ఆయన కాజీపేటకు చేరుకున్నారు. జంక్షన్‌లోని పలు కార్యాలయాలు, ప్లాట్‌ఫాంలు, స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు, నూతనంగా నిర్మిస్తున్న రైల్వే రన్నింగ్ రూం, సీసీసీ కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం డీజిల్ లోకో షెడ్డులోని ప్రతి సెక్షన్‌ను తనిఖీ చేశారు. కార్మికులను అంతర్గత సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో పలువురు షెడ్డులోని మహిళ కార్మికులకు రెస్ట్ రూం, అభివృద్ధి, రైల్వే క్వార్టర్స్ చాలా వరకు శిథిలావస్థకు చేరాయని, మరమ్మతు చేపట్టాలని వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట సీనియర్ డీఎంఈ వెంకట్ కుమార్, ఎస్ఎస్సీ అజ్మీరా మౌనికానాయక్, ఎస్ఎస్ఈ (సీఅండ్‌డబ్ల్యూ) రాంబాబు నాయక్, ఏడీఈఎన్ రామకృష్ణం రాజు, ఐవోడబ్ల్యూ అనిల్ ఉన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి : మేయర్

వరంగల్, మే 28 : బల్దియా విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. బుధవారం 29వ డివిజన్‌లోని పోతన నగర్, పాతబీటు బజార్, రామన్నపేట, 12 మోరీలు, రఘునాథ్ కాలనీ ప్రాంతాల్లో పర్యటించారు. పోతనరోడ్డులో స్మార్ట్‌సిటీలో భాగంగా చేపట్టిన పనుల మట్టి కుప్పలు తొలగించక పోవడంతో కాంట్రాక్టర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తు వర్షాల నేపథ్యంలో టౌన్‌ప్లానింగ్, శానిటేషన్, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ముంపు నివారణ చర్యలకు సన్నద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ డ్రేనేజీల్లో వేయకుండా చూడాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధించాలన్నారు. నాలాలు, డ్రైనేజీల పూడికతీత పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో రాజారెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ రవి కుమార్, టీపీఎస్‌లు ఇర్షాద్, శ్రీకాంత్, ఏఈ రాగి శ్రీకాంత్, ముజామిల్, హబీబ్, శానిటరీ సూపర్‌వైజర్ భాస్కర్, శానిటటీ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌రాజ్ పాల్గొన్నారు.

నూతన విత్తన చట్టం తయారీపై అభిప్రాయ సేకరణ

హనుమకొండ, మే 28 : నూతన విత్తన చట్టం ముసాయిదా తయారీపై కమిటీ సభ్యులు బుధవారం వరంగల్ జిల్లాలో పర్యటించారు. హనుమకొండ జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో విత్తన కంపెనీ ప్రతినిధులు, డీలర్లు, హనుమకొండ, వరంగల్ జిల్లాలకు చెందిన రైతు సంఘాల ప్రతినిధులు, రైతులు, వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయాలను సేకరించారు. కమిటీ సభ్యుడు, తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. అందరి సూచనలు, సలహాలు కమిటీ పరిగణలోనికి తీసుకొని కఠినంగా విత్తన చట్టం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కమిటీ సభ్యుడు సునీల్ కుమార్ (అడ్వకేట్) మాట్లాడుతూ.. మార్కెట్ చట్టంలోని లోపాలను ఆసరాగా చేసుకొని కంపెనీలు విత్తనోత్పత్తి చేస్తున్నాయన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు నర్సింహారెడ్డి, శివప్రసాద్ (డీఏవో సంగారెడ్డి), వరంగల్ జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, హనుమకొండ జిల్లా డీఏవో రవీందర్ సింగ్ పాల్గొన్నారు.

మొరం పనుల అడ్డగింత

పరకాల, మే 28 : పట్టణంలోని వెల్లంపల్లి రోడ్డులో దామెర చెరువు వద్ద కొనసాగుతున్న మొరం పనులను వీఆర్‌వో, వీఆర్ఏ అధికారుల సంఘం బాధ్యులు అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాదారం శివారులోని 609 సర్వే నంబర్‌లో 1.19 ఎకరాల భూమిని 1969లో పరకాల, రేగొండ, మొగుళ్లపల్లి, శాయంపేట, భూపాలపల్లి, పరకాలలో విధులు నిర్వర్తిస్తున్న వీఆర్‌వో, వీఆర్ఏలు సంఘంగా ఏర్పడి డబ్బులు జమ చేసి కొనుగోలు చేశారన్నారు. ఆ భూమిలో దామెర చెరువు పనులు చేస్తున్న కాంట్రాక్టర్ మొరం పనులు చేస్తున్నారని, ఇదేంటని అడిగితే స్థానిక ఎమ్మెల్యే పేరు చెబున్నారని అన్నారు. సంఘం బాధ్యులు పోషయ్య, చేరాలు, రవి, రాములు, శ్రీనివాస్, రమేశ్, రాజయ్య, సాంబయ్య, రాజు, సతీశ్, రూప, రజిత పాల్గొన్నారు.

మూడు రోజుల క్రితం కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు

పట్టించుకోని అధికారులు.. ట్రాన్స్‌ఫార్మర్ల ఎదుట రైతుల నిరసన

కాలిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

ఎల్కతుర్తి, మే 28 : ఒకే గ్రామంలో మూడు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు కాలి మూడు రోజులు అవుతున్నది. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడంతో చివరకు ట్రాన్స్‌ఫార్మర్ల ఎదుట రైతులు నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని సూరారం గ్రామానికి చెందిన సింగరాయగడ్డ ఏరియా ప్రాంతంలో ఇటీవల 3 వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. లైన్‌మెన్, ఎల్కతుర్తి ఏఈకి రైతులు ఫిర్యాదు చేశారు. నారుమడులు దున్నుకునే సమయమని, వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లు రిపేర్లు చేయాలని విన్నవించారు. పలుమార్లు ఎల్కతుర్తి ఏఈ కార్యాలయం చుట్టూ తిరిగినా అధికారుల నుంచి స్పందన కనపబలేదు. దీంతో విసిగి వేసారిన రైతులు కాలిన ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లు రిపేర్లు చేయాలని కోరుతున్నారు. రైతులు తక్కళ్లపల్లి కిషన్‌రావు, మిర్యాల కుమారస్వామి, బచ్చు కిషన్‌రావు, మేకల రవి, బాషబోయిన సాంబరాజు, గడల సాంబయ్య పాల్గొన్నారు.

కేయూ పరిపాలనా భవనంలో లిఫ్ట్ ప్రారంభం

హనుమకొండ చౌరస్తా, మే 28 : కాకతీయ విశ్వవిద్యాలయ పరిపాలనా భవనంలో రూ.13.65 లక్షలతో ఏర్పాటు చేసిన లిఫ్ట్, రూ.6 లక్షల విలువైన సివిల్ వర్క్స్‌ను బుధవారం వీసీ ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. దివ్యాంగ, సీనియర్ సిటిజన్లకు విశ్వవిద్యాలయంలో మొదటి అంతస్తులోకి వెళ్లడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. విద్యుత్ అంతరాయం తగ్గించడానికి క్యాంపస్‌లోని కామర్స్ విభాగం, ఆడిటోరియం ప్రాంతాల్లో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంట్ స్తంభాలు, హైటెన్షన్ లైన్లు ఏర్పాటు చేశామని, ఆ ప్రాంతంలో వీధి దీపాల నిర్వహణ, ఎడ్యుకేషన్ కాలేజీ, దూరవిద్యా కేంద్రం, మహిళా ఇంజినీరింగ్ కాలేజీ, కే-హబ్‌లో విద్యుత్ సమస్యలు తగ్గుతాయన్నారు. ఇందుకోసం రూ.30 లక్షలు వెచ్చించినట్లు డెవలప్‌మెంట్ ఆఫీసర్ వాసుదేవారెడ్డి తెలిపారు. రిజిస్ట్రార్ రామచంద్రం, పాలక మండలి సభ్యులు సురేశ్‌లాల్, రమ, సుదర్శన్, నవీన్, అనితారెడ్డి, సుకుమారి, చిర్ర రాజు, కట్ల రాజేందర్, వెంకట్రామిరెడ్డి, వరలక్ష్మి, నారాయణ, సమ్మయ్య, అయిలయ్య, ఏ రాజు, యూనివర్సిటీ ఇంజినీర్ వెంకటరమణ పాల్గొన్నారు.

నిట్‌లో నమూనా తయారీ పరికరాల ప్రదర్శన

నిట్‌లో నమూనా తయారీ పరికరాల ప్రదర్శనను పరిశీలిస్తున్న డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

హనుమకొండ చౌరస్తా, మే 28 : ఎన్ఐటీలోని సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఫెసిలిటీ (సీఆర్ఐఎఫ్), ట్రాన్స్‌మిషన్ ఎలక్ట్రాన్ మైక్రోస్కోపీ(టీఈఎం) నమూనా తయారీ పరికరాలపై ప్రదర్శన, వర్క్ షాప్ నిర్వహించారు. సూక్ష్మ, నానో స్థాయిల్లో అత్యంత కచ్చితమైన విశ్లేషణకు వీలు కల్పించే ఈ ఆధునిక పరికరాలు ఎన్ఐటీతో పాటు చుట్టుపక్కల ఉన్న విద్యాసంస్థల్లోని పరిశోధకులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని న